తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
23 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

### జిల్లా అభివృద్ధి కోసం స్పష్టమైన

# లక్ష్యాలతో పనిచేయాలి

### పలు సూచనలు చేసిన కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్- 22( జనంసాక్షి) జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికే రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రణాళికలను వివరించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లోగా వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఆరు నుంచి పన్నెండు నెలల్లో, దీర్ఘకాలిక లక్ష్యాలను పన్నెండు నుంచి ఇరవై నాలుగు నెలల్లో సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి నెల లక్ష్యాల సాధనలో పురోగతిని సమీక్షించాలని, నిర్దేశిత నమూనాలో పూర్తి వివరాలతో ప్రణాళికలను సవరించి తిరిగి సమర్పించాలని ఆదేశించారు. అత్యంత ముఖ్యమైన పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల ప్రణాళికలకు ప్రాథమిక కార్యాచరణ నమూనా సిద్ధమైన తర్వాత ప్రతి రంగానికి అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. జిల్లాలో శిశు మరణాల రేటు , మాతృ మరణాల రేటు తగ్గించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయడంతో పాటు ప్రసవాల వివరాలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, టీకాల కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల మెరుగుదలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇప్పటికే అమలులో ఉన్న విధానాలను క్షేత్రస్థాయిలో ఎలా పర్యవేక్షిస్తున్నారో నిర్దేశిత నమూనాలో వివరాలు సమర్పించాలని తెలిపారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో పిల్లల్లో పోషకాహార లోపానికి గల కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రతి అంశంపై లక్ష్యాలు, అమలు విధానం, పర్యవేక్షణ వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల ప్రస్తుత రేటింగ్‌ను పరిగణనలోకి తీసుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. పాఠశాలల వారీగా సాధించాల్సిన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

మిగతా 2లో



# అర్హులైన వారందరికీ నిబంధనల ప్రకారం పెన్షన్లు

### జడ్పీ సీఈవో శిరీష

చిలుకూరు అక్టోబర్ 22 (జనంసాక్షి): మండలంలోని అన్ని గ్రామాలలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్లు అందజేస్తామని జడ్పీ సీఈవో శిరీష తెలిపారు. చిలుకూరులో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికుల వివరాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిబంధనల మేరకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మొక్కపాటి నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, రవికుమార్,

### బొమ్మలరామారం మండలంలో

# కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటన



వార్తా లోపలి పేజీలో

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయపక్షపాతం నివారించండి

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 22 (జనంసాక్షి)



ఇందిరమ్మ ఇళ్ళు లాటరీ పద్ధతిలో కేటాయించాలని, సర్పంచ్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, కాంగ్రెస్ వారితో వున్న ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని కోరుతూ. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు, ఇస్తామని ప్రభుత్వం క్రటించింది. ప్రజాపాలన పేరుతో గ్రామ సభలు నిర్వహించింది. అర్హులను గుర్తించి ఎల్1, ఎల్ 2, ఎల్3 కేటగిరీలు ప్రకటించారు. మొదటి విడతలో ఇందిరమ్మ కమిటీలకే లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం ఉందన్నారు. ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలే ఉన్నారు. నిబంధనలతో నిమిత్తం లేకుండా వారు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, వారి అనుయాయులకే ఇండ్లు మంజూరు చేశారు. రెండో విడతలో గ్రామ సర్పంచ్లో ఇందిరమ్మ కమిటీలకు ఛైర్మన్లుగా ఉంటారని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రతిపక్ష పార్టీల సర్పంచ్లు ఉన్న గ్రామాలలో సర్పంచ్లకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా మళ్ళీ కాంగ్రెస్సయకులు పంపిన లిస్టు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలలో ఫైనల్ చేసి అధికారులకు ఇస్తున్నారు. ఎల్2, ఎల్3లలో ఉన్న వారిని, అసలు గ్రామ సభలో ఎంపిక కానీ వారికి కూడా ఇళ్ళు కేటాయింపులు జరిగిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు దీనిని ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించి, కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరిన వారికే ఇళ్ళు ఇస్తామని బేరసారాలకు దిగుతున్నారు. అధికార పార్టీలో చేరితే మీరు చెప్పిన వారికి ఇండ్లు ఇస్తామని, ఇతర అభివృద్ధి పనులకు డబ్బులు మంజూరు చేస్తామని ప్రతిపక్ష పార్టీల సర్పంచ్లకు ఆఫర్లు ఇస్తున్నారు. ప్రజల డబ్బుతో అమలు చేసే సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకొనే అనైతిక, అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. జిల్లా అధికారులు, అధికార యంత్రాంగం కూడా, నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు చెప్పినట్లు రాజకీయ పక్షపాత వైఖరికి సహకరించటాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాము. జిల్లా అత్యున్నత అధికారిగా మీరు జోక్యం చేసుకొని ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో జరుగుతున్న అవకతవకలు, అధికార దుర్వినియోగాన్ని, రాజకీయ పక్షపాతాన్ని సరిదిద్దాలని. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలి. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలి.. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలోని కమిటీల ద్వారా లబ్ధిదారుల లిస్టును రూపొందించ చేయాలి. అర్హులనే పేరుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇళ్ళు కేటాయించే రాజకీయ పక్షపాతాన్ని అరికట్టాలి. చట్ట విరుద్ధమైనటువంటి ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి. అధికార యంత్రాంగం నిబంధనలు పాటించాలి. రాజకీయ పక్షపాతాన్ని విడనాడాలి. కార్యక్రమంలోతాత మధు,దండి సురేష్ నున్నా నాగేశ్వరరావు, సి.వై.పుల్లయ్య ,జి రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు,ఆవుల అశోక్,బందెల వెంకయ్య శిరోమణి,టీ రూప్సీ, కె శ్రీనివాస్,ఎస్ కె లాల్మియా, కె నాగేశ్వరావు,టీ హనుమంతరావు బందారు ఐలయ్య. తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ కింద పడి మహిళ దుర్మరణం



**ఇప్పటికే తండ్రిని కోల్పోయిన ఇద్దరు ఆడపిల్లలు..**

**నేడు తల్లి మృతితో అనాథలుగా మారిన వైనం**

**శోకసముద్రంలో చెరువుపల్లి గ్రామం**

మాడుగులపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి): మాడుగులపల్లి మండల కేంద్రంలోని చెరువుపల్లి రోడ్డులో గురువారం చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం ఒక నిరుపేద కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ధాన్యం లోడుతో వచ్చిన ట్రాక్టర్ రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు కన్నతల్లిని పొట్టనబెట్టుకోవడంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన మద్దెల అంజలి తన కూతురితో కలిసి మాడుగులపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చెరువుపల్లి రోడ్డులో వెళ్తుండగా ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ వారి స్కూటీని ఢీకొట్టింది ఈ ప్రమాదంలో అంజలి అదుపుతప్పి కిందపడిపోగా, ఆమెపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో కాలు, నడుము భాగం తీవ్రంగా నుజ్జునుజ్జై తీవ్ర గాయాల పాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు టోల్ ప్లాజా అంబులెన్స్ సహకారంతో బాధితురాలను వైద్య నిమిత్తం వార్తా లోపలి పేజీలో

# జిల్లా అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలి

సారించాలని తెలిపారు. పరిశ్రమలు, మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న నైపుణ్యాల డిమాండ్‌కు అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందించాలని సూచించారు.నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో ఎక్కువ మంది యువత పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ పొందుతున్న యువత వివరాలు, శిక్షణ పురోగతి, సాధించిన ఫలితాలపై ప్రత్యేక రికార్డు నిర్వహించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి సదుపాయాల పరిస్థితిని వచ్చే వారం రోజుల్లోగా సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, ఉత్పత్తులు, పారిశ్రామిక అవకాశాలను పరిగణనలోకి తీసుకొని పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. పెద్ద, మెగా పరిశ్రమల స్థాపనకు అవకాశాలను గుర్తించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల పరిధిలో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో మిర్చి ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ, దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిర్చి ప్రాసెసింగ్‌తో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిపాదిత ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది, ఎంత ఆర్థిక విలువ సృష్టించ వచ్చు అనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరు సహా సంబంధిత పరిపాలనా ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల పనితీరు, లక్ష్యాల సాధన, సేవల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేయాలని తెలిపారు. దీనికి అవసరమైన సమాచారాన్ని ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల నుంచి వివరాల సేకరణకు తగిన విధానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరు మెరుగుపరచడంతో పాటు త్రాగునీటి సరఫరా, ఫుట్‌పాత్‌లు, పారిశుధ్య సదుపాయాలను మెరుగు పరచాలని కలెక్టర్ తెలిపారు. పట్టణాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర పట్టణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.జనాభా పెరుగుదల, పట్టణాలు, నగరాల విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు, భవన నిర్మాణాల అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయం నుంచి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. వివిధ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించి, సేవలను వేగంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి సేవకు సంబంధించి తీసుకునే సమయం, సేవల పంపిణీలో మెరుగుదల వంటి అంశాలపై స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు.అన్ని శాఖలు తమ ప్రణాళికలను సూచనలకు అనుగుణంగా సవరించి, నిర్దేశిత నమూనాలో తిరిగి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి నెలా లక్ష్యాల సాధనను సమీక్షిస్తూ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ఫలితాల ఆధారంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సిపిఓ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్స్ అందరు తమ తమ ఓట్లు నమోదు చేసుకోండి

○ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపుడి రాంబాబు



**కామేపల్లి,అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండల పరిధిలో వివిధ గ్రామాల పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్స్ (పట్టభద్రులు)తమ తమ ఓట్లను ఉచితంగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు తెలిపారు.కామేపల్లి కేంద్రంలో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మిగతా కేంద్రాలను కూడ ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోవింద్రాల సెంటర్లో ఓటు నమోదు కేంద్రం లో రుక్కి తండా,కొత్త లింగాల, పండితా పురం గ్రామాల పట్టభద్రులు ఉచితంగా తమ తమ ఓట్లను నమోదు చేసుకోవాలని కోరారు.బర్లగూడెం కేంద్రంలో గరిడేపల్లి, పొన్నెకల్, నెమలిపురి గ్రామాల వారు కామేపల్లి కేంద్రంలో ఊట్కూర్, ఆర్కేపురం, కెప్టెన్ బంజర గ్రామాల వారు మద్దులపల్లి కేంద్రంలో లాల్య తండా,జగన్నాథ్ తండా,భాసిత్ నగర్ గ్రామాల గ్రాడ్యుయేట్స్ తమ తమ ఓట్లను నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పత్తే మహమ్మద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య, కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు టిపిసిసి మెంబర్ కామేపల్లి సొసైటీ అధ్యక్షులు పుచ్చకాయ వీరభద్రం,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు,కాంగ్రెస్ శాఖ పార్టీ అధ్యక్షులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గా మాత శోభాయాత్ర : భక్తి శ్రద్ధలతో ముగిసిన వేడుకలు





**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఖమ్మం నగరంలోని 14, 15వ డివిజన్ కొత్తగూడెంలో సింహవాహిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ సహాకారంతో అమ్మవారి శోభాయాత్ర అత్యంత కనుల పండుగగా, శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు మాట్లాడుతూ. కొత్తగూడెం 14 15వ డివిజన్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించామని అదేవిధంగా దసరా పండుగ సందర్భంగా దేవి నవరాత్రుల ఉత్సవాలు, అమ్మవారి నిమజ్జనోత్సవం కోలాట నృత్యాలతో మహిళలు ఆడుతూ పాడుతూ కొత్తగూడెం పురవీధుల్లో చేపట్టిన ఈ శోభాయాత్రలో భక్తులు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ?ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు డిజే హోరు మరియు డప్పు వాయిద్యాల నడుమ యువకులు భక్తి పారవశ్యంతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారని మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారని ?పురవీధులన్నీ అమ్మవారి నామస్మరణతో, భక్తి గీతాలతో మార్మోగాయన్నారు. శోభాయాత్ర మార్గంలో సింహవాహిని ఉత్సవ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ప్రసాద వితరణ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల చొరవతో ఈ కార్యక్రమం విజయవంతమైందని, భక్తులందరూ అమ్మవారి కృపకు పాత్రులయ్యారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, భూమా రాంమూర్తి, సీతల సత్యం, లక్కా వీరయ్య, పోతురాజు వెంకటేశ్వర్లు, పగడాల శ్రీను, పర్వత సైదులు, మాకనబోయిన నాగేశ్వరరావు, ములకలపల్లి అచ్చయ్య, భూమా జాను, తుపాకుల శ్రీకాంత్, కోటేశ్వరరావు, దంతాల నాగరాజు, షేక్. ఫకీర్, పగడాల వెంకటేశ్వర్లు, అమరారపు ఉపెందర్, చింతకాయల హనుమంతరావు, నాగటి నరేష్, దంతాల శ్రీకాంత్, పగడాల చంద్రశేఖర్, లింగం సూరి, తుపాకుల నవీన్, బుడిగ వెంకన్న, ముద్రబోయిన అప్పారావు, రావుల సంజీవరావు, బుడిగె వెంకట్రావు, దొప్ప శ్రీను, భూమా గురవయ్య, ప్రతానపు ప్రసాద్, అమరారపు వెంకటమ్మ, లక్క రేణుకా, దంతాల రాధ,త్రివేణీ, మాకనబోయిన పార్వతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భారీ దుర్గామాత విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

○ నిమజ్జనం సమయంలో భక్తులు, ప్రజలు దగ్గరకు రాకుండా చర్యలు చేపట్టాలి..

○ సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ..



**భద్రాచలం అక్టోబర్ 22 (జనంసాక్షి)**

గోదావరిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. భారీ విగ్రహాలను క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో భక్తులు, ప్రజలు సమీపంలోకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాచలంలోని గోదావరి కరకట్ట వద్ద గురువారం దుర్గామాత విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. తొమ్మిది రోజులపాటు నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా నిమజ్జనం కోసం భద్రాచలం గోదావరికి వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కొన్ని విగ్రహాలు అత్యంత భారీగా ఉండటంతో వాటిని వాహనాల నుంచి క్రేన్ సహాయంతో కిందకు దించి గోదావరిలో నిమజ్జనం చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులకు సూచించినట్లు తెలిపారు. ఐటీసీ బృందం సహకారంతో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్త మండళ్లకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. దుర్గామాత భక్త మండళ్ల సభ్యులు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ కోరారు. భారీ విగ్రహాల నిమజ్జనం సమయంలో అత్యుత్సాహానికి పోయి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసిన అనంతరం తమ గ్రామాలకు క్షేమంగా తిరిగి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, జీపీఈవో శ్రీనివాస్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, ఐటీసీ బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్యులగూడెంలో ఘనంగా మడేలేశ్వర స్వామి పండుగ మహోత్సవం

**చిలుకూరు, అక్టోబర్ 22 (జనంసాక్షి):** చిలుకూరు మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో రజకుల ఆరాధ్యదైవమైన శ్రీ మడేలేశ్వర స్వామి పండుగ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మీ పాల్గొని మడేలేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఐకమత్యం వెల్లివిరిసి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించారు. పండుగ మహోత్సవం భక్తి వాతావరణంలో సాగడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



# సొసైటీల లాభనష్టాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

○ అన్ని బ్యాంకు ఖాతాల నిల్వల వివరాలు సమర్పించాలి ○ ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్

**భద్రాచలం అక్టోబర్ 22 (జనంసాక్షి)**
జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సొసైటీల గత మూడేళ్ల ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాలు, లాభనష్టాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ అధికారులను ఆదేశించారు. సొసైటీలకు సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాల నిల్వల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, కచ్చితమైన సమాచారంతో నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. గురువారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో తన ఛాంబర్‌లో జీసీసీ అధికారులు, ఆడిట్ బృందంతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీల పనితీరు, గత మూడేళ్ల కార్యకలాపాలు, ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఇతర సంస్థలకు జీసీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి పూర్తి వివరాలతో ప్రణాళికలు రూపొందించి సకాలంలో సమర్పించాలని సూచించారు. జీసీసీ మేనేజర్లు తమ పరిధిలోని సొసైటీల కార్యకలాపాలను విడివిడిగా పరిశీలించి, మూడేళ్ల ఆదాయ వ్యయాలు, లాభనష్టాలను లెక్కించాలని తెలిపారు. ప్రతి సొసైటీ ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు.



2026 సెప్టెంబర్ నాటికి హాస్టళ్లకు సంబంధించిన బకాయిల వివరాలను ఏటీడీవోలు, గురుకులాల ప్రిన్సిపాళ్ల వద్ద ఉన్న వివరాలతో సరిపోల్చి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని ఆదేశించారు. సొసైటీల పరిధిలోని అన్ని బ్యాంకు ఖాతాల నిల్వలను పరిశీలించి, ఖచ్చితమైన వివరాలను నివేదికల్లో పొందుపరచాలని డేవిడ్ రాజ్ స్పష్టం చేశారు. అధికారులు సమర్పించిన నివేదికలను ఆడిటర్లు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి అందజేస్తామని తెలిపారు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా నివేదికలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎం జీసీసీ రామానందం, జీసీసీ మేనేజర్ జయరాజ్, ఆడిట్ అధికారులు, డివిజన్ జీసీసీ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్వపల్లిలో ఘనంగా ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ జన్మదిన వేడుకలు



జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి): పేద, బహుజన విద్యార్థుల ఉన్నతికి గురుకులాల స్థాపనతో బాటలు వేసిన మాజీ ఐఏఎస్ అధికారి స్వర్గీయ ఎస్.ఆర్. శంకరన్ 92వ జయంతిని పురస్కరించుకొని గురువారం అర్వపల్లి మండల కేంద్రంలో 15వ 'స్వేరోస్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వేరో నెట్వర్క్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వేరో నాయకులు, తల్లిదండ్రులు, అభిమానులు పాల్గొని సంబరాలు జరుపు కున్నారు.?ఈ సందర్భంగా మచ్చ నర్సయ్య మాట్లాడుతూ... ఎస్.ఆర్. శంకరన్ ఆశయాలకు అనుగుణంగా గురుకులాల మాజీ కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ "అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం" అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో స్వేరో నెట్వర్క్ ను స్థాపించి బహుజన బిడ్డలను ప్రపంచ వేదికలపై అగ్రస్థానంలో నిలుపుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా అధ్యక్షుడు దడిపల్లి వెంకట్, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, స్వేరో అభిమానులు మోదాల లింగమల్లు, వినీత్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి చేరిపల్లి కైలాసం మృతి బాధాకరం

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ చేరిపల్లి కైలాసం మృతి పట్ల ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చేరిపల్లి కైలాసం పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ కైలాసం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన సేవలు పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఒక మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన మరణం పార్టీ శ్రేణులకు తీరని లోటుగా మిగిలిపోతుందని అన్నారు. ఈ కష్టకాలంలో కైలాసం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భగవంతుడు వారి కుటుంబానికి అన్ని విధాలా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని కైలాసం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారివెంట డిసిసి ప్రధాన కార్యదర్శి ఉట్కూరి వేమన్ రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు బోడిగె శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తేరా సత్యనారాయణ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బియర్ఎస్ లింగారెడ్డి, చెన్నయ్య చారి, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, మునగపాటి శ్రీనివాస్, గాజుల ప్రసాద్, చిలుకూరి జగదీశ్వర్, టింబర్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని రైతు వేదికలో ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులకు శిక్షణ

### మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఇందిరా డెయిరీ లక్ష్యం: అంబటి వెంకటేశ్వరరావు





**చింతకాని, అక్టోబర్ 22 (జనంసాక్షి**
మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా డెయిరీ పథకాన్ని అమలు చేస్తోందని మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం చింతకాని రైతు వేదికలో మండల ఏపీఎం నాగా పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన లబ్ధిదారుల అవగాహన శిక్షణ శిబిరానికి జేడీ బోడెపూడి ఉపేందర్, అంబటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మానస పుత్రికగా ఇందిరా డెయిరీ పథకాన్ని అభివర్ణించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ముందుకు తీసుకువచ్చిందని, త్వరలోనే లబ్ధిదారులకు గేదెల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాడి పరిశ్రమ ద్వారా మహిళలు ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్.కె. కాసిం, సర్పంచ్ ఓర్సు వీరభద్రం, పశువైద్యాధికారులు డాక్టర్ రంజి, డాక్టర్ శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మణరావు, కాంగ్రెస్ నాయకులు, వెలుగు సీసీలు, గ్రామ దీపికలు, మహిళా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మనసును పరమాత్మకు అంకితం చేయడమే నిజమైన భక్తి మార్గం!

○శ్రీ సాయిసన్నిధిలో డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచనామృతం

○'యోగ సమాధి' అంశంపై భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు..

**చింతపల్లి, అక్టోబర్ 22(జనంసాక్షి)**
శ్రీ సాయినాథుని 108వ పుణ్యతిథి మహోత్సవాలు, శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ స్ణాయిసన్నిధిలో గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రముఖ మహా సహస్రావధాని, పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు 'యోగ సమాధి' అంశంపై భక్తులకు అద్భుతమైన ప్రవచనామృతాన్ని అందించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన ఆయన ప్రవచనం భక్తులను ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తింది. జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులు రచించిన 'నిరంజనాష్టకం' ఆధారంగా గరికిపాటి నరసింహారావు తనదైన శైలిలో అనర్గళంగా ప్రవచనం సాగించారు. మానవులు భక్తిమార్గంలో పయనిస్తూ తమ మనసులను పరమాత్మకు అంకితం చేయాలని, మనస్సును నిష్కల్మషం గా ఉంచుకొని భగవంతుని సేవలో లీనం చేయడమే నిరంజన మార్గంలోని ప్రధాన సారమని వివరించారు. భక్తితోనే ఆధ్యాత్మిక ఉన్నతి.. యుగ యుగాలుగా భక్తు లను తరింపజేయడానికి పరమాత్ముడు వివిధ అవతా రాల్లో అవతరిస్తున్నారని, కలియుగంలో షిరిడీ సాయి నాథుని వంటి సద్గురువుల ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం లభిస్తోందని పేర్కొన్నారు. సద్గురువుల బోధనలను ఆచరిస్తూ భక్తితో జీవనం సాగించాలని సూచించారు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు భక్తి, యజ్ఞయాగాదులు, హోమాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే పుణ్యక్షేత్రాల్లో భక్తులకు విశేష అనుభూతిని కలిగిస్తారని వివరించారు. భగవంతుని స్మరించుకోవడానికి ప్రత్యేక సందర్భాలే అవసరం లేదని, నిత్యజీవితంలో తమ కర్తవ్యాలను నిర్వహిస్తూనే దైవచింతనలో గడపవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ, కొమిరిశెట్టి వెంకటయ్య, పూరే కృష్ణయ్య, కుంభం



పుల్లారెడ్డి, తడకమల్ల శ్రీనివాస్, జెల్ల జయరాములు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...



## ట్రాక్టర్ కింద పడి మహిళ దుర్మరణం

నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు దీంతో ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు కోల్పోయినట్టుగా తెలుస్తుంది.అలవి కాని వేదనలో ఇద్దరు ఆడపిల్లలు.. శోకసముద్రంలో ఊరు మృతి చెందిన అంజలి భర్త గతంలోనే చనిపోగా, అప్పటి నుంచి ఆమె కష్టపడి ఇద్దరు ఆడపిల్లలను పోషిస్తోంది. కన్నతండ్రి లేని ఆ పిల్లలకు ఆ అమ్మే సర్వస్వమైంది నేడు తల్లి కూడా రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆ ఇద్దరు ఆడపిల్లలు పూర్తిగా అనాథలుగా మారారు ఇక మాకు దిక్కెవరు? అని ఆ ఇద్దరి ఆడపిల్లల పరిస్థితిని చూసి ఊరు మొత్తం శోక సముద్రంలో మునిగిపోయింది ఆ చిన్నారుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఆ చిన్నారులను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పాల్వంచ పట్టణంలో ఘనంగా స్వేరోస్ డే వేడుకలు

## అక్షరం.. ఆరోగ్యం.. ఆర్థికం.. నినాదంతో విద్య, సామాజిక చైతన్యానికి పిలుపు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అక్షరం.. ఆరోగ్యం.. ఆర్థికం.. అనే నినాదంతో జ్ఞాన యోధుడు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆలోచనల మేరకు 2012లో స్వేరోస్ నెట్‌వర్క్ ఏర్పాటైంది. గురుకుల పితామహుడు ఎస్.ఆర్. శంకరన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం స్వేరోస్ డే వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని సి కాలనీ గేటు ఎదురుగా స్వేరోస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య జెండా ఆవిష్కరించి వేడుకలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్.ఆర్. శంకరన్ భారతదేశంలో పేదలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ఐఏఎస్ అధికారి, సామాజిక సేవకుడని కొనియాడారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని విశ్వసించిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో స్వేరోస్ దేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన దళిత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాల అభివృద్ధికి ఎస్.ఆర్. శంకరన్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వేరోస్ నెట్‌వర్క్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేలా సైనిక్, స్పోర్ట్స్, కంప్యూటర్, లా, ఫార్మసీ వంటి విద్యా విభాగాల్లో అవకాశాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. స్వేరోస్ ఆశయాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని, యువతలో నూతన ఆలోచనలను పెంపొందించాలని, విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ



భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు ఐ. కుమార్, కొత్తపల్లి శ్రీను, యువ న్యాయవాది రోహిత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, సీనియర్ నాయకులు రవికిరణ్, శేషు, జిల్లా కమిటీ సభ్యులు కిషోర్, నాగరాజు, సుభాని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

### - స్వామివారిని దర్శించుకున్న ఎంపీ పోరిక బలరాంనాయక్



**భద్రాచలం అక్టోబర్ 22 (జనంసాక్షి)** భద్రాచలం లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి నిత్యకల్యాణాన్ని గురువారం ఆలయ వైదిక బృందం సంప్రదాయ బద్ధంగా, వైభవంగా నిర్వహించింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ వేడుక భక్తులను ఆకట్టుకుంది. కల్యాణంలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం తదితర క్రతువులను వైదిక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వైదిక బృందం ఆయనకు వేద ఆశీర్వచనం అందజేసింది.

## సత్తా చాటిన హుస్సేన్ జాఫర్ను సన్మానించిన ఎంపీజే



**ఖమ్మం, అక్టోబర్ 22 (జనంసాక్షి)** ఆటో డ్రైవర్ కుమారుడైన హుస్సేన్ జాఫర్ వైద్య విద్యలో సీటు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన ఎస్.కె. హుస్సేన్ జాఫర్ నీట్-2026లో 468 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 16,793వ ర్యాంక్, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2,407వ ర్యాంక్ సాధించాడు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు పొందాడు. ఈ సందర్భంగా ఎంపీజే ఖమ్మం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ జాఫర్‌ను అభినందించారు. జాఫర్ తండ్రి ఎస్.కె. మదార్ సాహెబ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి జాఫర్ సాధించిన విజయం కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. పట్టుదల, కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అతను నిరూపించాడని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవలందించాలనిఆకాంక్షించారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో జాఫర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ అహ్మద్, కోశాధికారి ఎం.డి. హకీమ్, కార్యదర్శులు బి. సతీష్, రఫీ, సభ్యులు ఖుర్షీద్, హుస్సేన్ మియా, షరీఫ్, సువాన్ పాషా, మహమూద్, జమాతే ఇస్లామి హింద్ జిల్లా మాజీ అధ్యక్షులు ఖలీల్ అహ్మద్, సేవా బ్యాంక్ మేనేజర్ ఎం.డి. మొయినుద్దీన్ ఎంపీజే సభ్యులు మునీర్ జానీ మియా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ ప్రజలను దోపిడీ చేస్తున్న భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. పండుగ సాయన్న కేవలం సంపన్నుల నుంచి ఆస్తులను తీసుకొని పేదలకు పంచి పెట్టడానికే పరిమితం కాకుండా, ఆనాటి పాలనలోని అధికార వ్యవస్థను ప్రశ్నించి, అధికారులను ఎదిరించారని తెలిపారు. తనదైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రయత్నించారని వివరించారు. ప్రజల



కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం, ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, అధికారులు, కుల సంఘ నాయకులు ములకలపల్లి సంగమేశ్వర రావు, పిట్టల వెంకట నరసయ్య, రావుల హనుమంతరావు, అనంత రాములు, బైరు హరినాధ బాబు, లింగబోయిన లక్ష్మణ్, పిట్టల నాగేశ్వరరావు ముదిరాజ్, గోల్కొండ అంజయ్య, కొప్పెర జానకి రామయ్య, పొన్నెబొయిన స్వామి, సుంకర శ్రీనివాసరావు, నార్ల శేషయ్య, మామిడి వెంకటేశ్వర్లు, మేడారం వెంకటేశ్వర్లు, కొప్పెర ఉపేందర్, పొడగంటి రాంబాబు, మేకల సుగుణరావు, భద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతిపై దాడి, తండ్రికి తీవ్ర గాయాలు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 22 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం తోగ్గూడెం తండాలో దసరా ఉత్సవాల వేళ అమానుష ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఊగిపోతూ కొందరు వ్యక్తులు గిరిజన యువతిపై దాడి చేసి, అడ్డుబోయిన ఆమె తండ్రిని తీవ్రంగా కొట్టారు.
బాధిత యువతి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తోగ్గూడెం తండాకు చెందిన కుర్సం పార్వతి (28) అనే గిరిజన యువతి మాట్లాడుతూ.. అక్టోబర్ 21, 2026 మంగళవారం సాయంత్రం 5:40 గంటల ప్రాంతంలో తండాలో బతుకమ్మ సంబురాలు జరుగుతుండగా, తన తండ్రి కుర్సం చిన్నరాములుపై స్థానిక యువకులు మద్యం మత్తులో డ్యాన్స్ చేస్తూ నెట్టడం జరిగిందని తెలిపారు. దీనిని తప్పుపట్టిన పార్వతి, "ఎందుకు నెడుతున్నారు" అని వారిని వారించే ప్రయత్నం చేయగా.. అక్కడ ఉన్న భూక్య విజయరామరాజు, కుర్సం చిన్నారావు, భూక్య ఈశ్వర్, భూక్య చిట్టీ, భూక్య విష్ణు అనే ఐదుగురు వ్యక్తులు కలిసి తనపై అసభ్యకరంగా ప్రవర్తించారని వాపోయారు. మద్యం మత్తులో నానా బూతులు తిడుతూ, తమపై దాడికి దిగారని తెలిపారు. అడ్డువచ్చిన తన తండ్రిని పిడిగుద్దులతో జుట్టు పట్టుకుని ఇష్టానుసారంగా కడుపులో, చాతిపై బలంగా కొట్టారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులు క్రితమే తనకు గర్భసంచి ఆపరేషన్ జరిగిందని, ఆ విషయాన్ని పట్టించుకోకుండా పొట్టపై తన్నడంతో తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిపోయానని చెప్పారు. గ్రామస్తులు జోక్యం చేసుకుని తండ్రిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు పరిశీలించి తండ్రి ఎడమ భాగం చాతిపై బలమైన దెబ్బ తగిలినట్లు నిర్ధారించారని తెలిపారు. తమ కుటుంబానికి రక్షణ కల్పించి, దాడులకు పాల్పడిన నిందితులపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులను కోరారు.

# స్వర్ణగిరిలో పవిత్రోత్సవాల వైభవం

## సూర్యప్రభ వాహనంపై స్వర్ణగిరీశుడు.. పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడి ఊరేగింపు



**భువనగిరి,అక్టోబర్ 22(జనంసాక్షి)** యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.
సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారి ఊరేగింపు




**కొండమల్లేపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** శ్రీ అష్టలక్ష్మి శ్రీ చక్ర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గురువారం దేవి శరన్నవ రాత్రుల ముగింపు వేడుకలు కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో ఘనంగా జరిగాయి. దేవి శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మ వారిని పూల రథంపై ఉంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ప్రత్యేక వాహనం వెంట భజనలు, కోలాటాల బృందాల నృత్యా లతో ఊరేగింపు వేడుకలు వైభవంగా సాగాయి. అమ్మవారి ఊరేగింపు వేళ భక్తులు అడుగడుగునా అమ్మవారికి నీరాజనాలు పలికారు. భక్తులు టెంకాయ, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన రహదారుల వెంట దారి పొడవునా మహిళలు అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఊరేగింపు వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వూరె జనార్దన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్ సెక్రెటరీ దొడ్డి సుధాకర్, బండారు రాము, బూరుగు హరిప్రసాద్, రాచమల్ల నరసింహ, ముచ్చర్ల కర్ణాకర్ మాధవి, ఊరే నరేష్, దొడ్డి కృష్ణయ్య, పూజారి పవన్ కుమార్, మిర్యాల శ్రీనివాస్, అంకిశెట్టి శేఖర్, సముద్రాల ధనయ్య, దాచేపల్లి నరేందర్, కర్నాటి శ్రీనివాస్, జిన్నం రామ్మూర్తి, నీలా లక్ష్మయ్య, ఆకుతోట లక్ష్మీనారాయణ, చందా ధనుంజయ, రాచమల్ల నరసింహ, మారం వెంకటేశ్వర్లు, దుండిగళ్ళ అశోక్, సముద్రాల వెంకటేశ్వర్లు, నీలా ఉదయశ్రీ, బూరుగు శ్రీకాంత్, కామిశెట్టి హరీష్, సముద్రాల మహేష్, నీలా విజయ్ పోల శ్రీనివాస్, బండారు శ్రీకాంత్, చెట్లపల్లి శ్రీనివాస్, పంపాటి శ్రీధర్, వీరమల్ల వెంకటయ్య, బూరుగు శ్రీకాంత్, దొడ్డి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వేరో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**తుంగతుర్తి అక్టోబర్ 22 (జనంసాక్షి)** తుంగతుర్తి మండల కేంద్రంలో గురువారం గురుకులాల స్థాపనకు కృషిచేసి ఎంతోమంది పేద విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసిన ఎస్.ఆర్ శంకరన్ జయంతిని పురస్కరించుకొని గురుకులాల మాజీ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ (వాలంటరీ అడిషనల్ డీజీపీ) నేతృత్వంలో స్థాపించిన స్వేరోస్ డే ఆవిర్భావ వేడుకలను సీనియర్ స్వేరో నాయకులు కొండగడుపుల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వేరో రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ నరసయ్య మాట్లాడుతూ... ఐఏఎస్ అధికారిగా ఉంటూ ఎంతో మంది పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేదరికం నుంచి ఎన్నో కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి ఎస్ఆర్ శంకరన్ అని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా గురుకులాల మాజీ కార్యదర్శి రిటైర్డ్ ఐపిఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరో నెట్వర్క్ ను స్థాపించి అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే నాలుగు ప్రధాన నినాదాలతో స్వేరో సంస్థ పేద బిడ్డల జీవితాలను ప్రపంచానికి కేంద్ర బిందువుగా నిలబెట్టాలని లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. పేద బిడ్డలకు ఉన్నత విద్య అందించాలని లక్ష్యంతో ఎస్.ఆర్ శంకరన్ స్థాపించిన గురుకులాల స్ఫూర్తిని కొనసాగిస్తూనే డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ "స్వేరోస్ డే" ను నామకరణం చేశారని గుర్తు చేశారు. మలావత్ పూర్ణ, ఆనంద్ లను ఎవరెస్టు శిఖరం ఎక్కించి "మేము ఎవరి కంటే తక్కువ కాదు"అని స్వేరోలు నిరూపించారని తెలిపారు. డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రేరణతో నేడు స్వేరోలు అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో నాయకులు కొండగడుపుల నవీన్, గుండగాని మహేష్, చింతకుంట్ల పరమేష్, పసుపులేటి చింటూ, గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# రైతులు కాలానుగుణంగా పంటల మార్పు చేసుకోవాలి

## ఏవో ధరావత్ సైదా నాయక్

**నూతనకల్ అక్టోబర్ 22( జనంసాక్షి)**

రైతులు ఎల్ నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటల మార్పు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధరావత్ సైదా నాయక్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం దిరిశనపల్లి రైతు వేదికలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని గురువారం దిరిశనపల్లి రైతు వేదికలో రైతుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ధీరావత్ సైదా నాయక్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, భూసార పరిరక్షణ, నీటి సంరక్షణ, ఎరువుల సమర్థ వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతులు మరియు సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ తరాలకు భూమి సారవంతంగా ఉండేలా రైతులు ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే యాసంగి సీజన్‌లో అధిక నీటిని వినియోగించే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా పెసర, మినుము, అలసంద, వేరుశనగ వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని వారు తెలిపారు. నీటి వృథాను అరికట్టేందుకు తుంపర్ల సేద్యం, బిందు సేద్యం వంటి ఆధునిక నీటి పారుదల పద్ధతులను అవలంబించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యతనిస్తూ రైతులు స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, పావని, రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు.

# కక్కిరేణిలో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు





**రామన్నపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలో మత్స్య పారిశ్రామిక శ్రామిక సంఘం ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు చిల్ల ఆంజనేయులు సంగం జెండా ఆవిష్కరణ చేసి అనంతరం సభలో పాల్గొని మాట్లాడుతూ, పండుగ సాయన్న ముదిరాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి, సంఘ ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ పాల్గొని తమ సందేశాన్ని అందించారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘ అభివృద్ధి, సామాజిక ఐక్యతకు సంబంధించిన అంశాలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్ , సొసైటీ కార్యదర్శి అంకిరెడ్డి రాములు, సొసైటీ ఉపాధ్యక్షులు మెట్టు మధు, డైరెక్టర్లు చిల్ల అశోక్, అంకిరెడ్డి ఉపేందర్, కోట సత్తయ్య, చిల్ల రఘుపతి, అంకిరెడ్డి మధురవేణి, సొసైటీ సభ్యులు దుడ్డు రాములు, గుండు రమేష్, అంకిరెడ్డి నరసింహ, చింతకాయల వీరయ్య, చిల్ల నరసింహ, చిల్ల నరేష్, శంకరయ్య, యాదగిరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదితతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటు నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఇలాంటి సహాయ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, కౌన్సిలర్ నాగుల వాసు, పాలగాని కృష్ణ, సైదిరెడ్డి, ధర్మా నాయక్, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, అరవింద రెడ్డి, లింగరాజు, పిల్లల వెంకన్న, జాకబ్, మేరెడ్డి ఉపేందర్, జోగం సైదులు, భూక్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా లో బుల్లెట్ బైక్ గెలుచుకున్న విజిత

**సూర్యాపేట(జనంసాక్షి):**

జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ సెంటర్ లో శ్రీదుర్గామాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రోత్సవాల ఐదవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన లక్కీ డ్రా లో పొట్లపహాడ్ గ్రామానికి చెందిన మేకపోతుల విజిత బుల్లెట్ బైక్ ను గెలుచుకున్నారు. పల్సర్ బైక్ ను సూర్యాపేటకు చెందిన సూర్య గెలుపొందారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు అభినందనలు తెలిపి వాహనాలను అందజేశారు. నిర్వాహకులు అంతటి అనిల్ మాట్లాడుతూ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గౌరవ సలహాదారులు కౌన్సిలర్ బైరు శైలేందర్, బిఆర్ఎస్ నాయకులు అనంతుల దుర్గాప్రసాద్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ఎంపిటిసి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.






# శివన్నగూడ ప్రాజెక్టు సాధనే లక్ష్యం

- శివన్నగూడ సాధనకు సమరశంఖం!
- మునుగోడు రైతాంగానికి సాగునీరు అందించాలి
- రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని సాకారం చేయాలి
- ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రజా ఉద్యమంతోనే ప్రాజెక్టుల సాధన
- రాజకీయాలకు అతీతంగా ఏకమవ్వాలి

## మునుగోడు రైతాంగ భవిష్యత్తుకు సాగునీరు కీలకం

## రాచకొండ దసరా ఉత్సవాలు-2026లో ఈఎల్వీ భాస్కర్ పిలుపు



*రాచకొండ ప్రాంత అభివృద్ధి, మునుగోడు రైతాంగానికి సాగునీరు, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఈఎల్వీ ఫౌండేషన్ అధినేత ఇరగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. శివన్నగూడ రిజర్వాయర్‌ను పూర్తి చేయడంతో పాటు రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని సాకారం చేయాలని డిమాండ్ చేశారు.*

**జనం సాక్షి ప్రత్యేక కథనం । మర్రిగూడ/గట్టుప్పల్, అక్టోబర్ 23:**

రాచకొండ దసరా ఉత్సవాల సమితి, ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాచకొండ దసరా ఉత్సవాలు–2026 గట్టుప్పల్ మండల కేంద్రంలో జరిగాయి. నిర్వాహకుల ప్రకారం సుమారు 15 వేల నుంచి 20 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యారు. జానపద గాయని మంగ్లీ, బిత్తిరి సత్తి, యాంకర్ రవి తదితరుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాం ఐ. కార్యక్రమంలో భాస్కర్ ప్రసంగం ప్రధానంగా సాగునీరు, రైతుల సంక్షేమం, ఫ్లోరైడ్ సమస్య, ప్రాంతీయ అభివృద్ధి అంశాల చుట్టూ సాగింది.

### శివన్నగూడ పూర్తితోనే రైతులకు మేలు

మునుగోడు ప్రాంత అభివృద్ధికి సాగునీరు అత్యంత అవసరమని భాస్కర్ పేర్కొన్నారు. శివన్నగూడ రిజర్వాయర్‌ను పూర్తి చేసి, రాచ కొండ ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రాజెక్టులు పూర్తయితే బీడు భూములకు సాగునీరు అందడంతో రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. శివన్నగూడకు నీరు, మునుగోడు ప్రాంతానికి సాగునీరు అందేలా ప్రజలు కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులను ఎన్నికల హామీలుగా కాకుండా ప్రజల హక్కుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

### ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

మునుగోడు ప్రాంతం ఎన్నో ఏళ్లుగా ఫ్లోరైడ్ సమస్యను ఎదుర్కొంటోందని భాస్కర్ అన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా భవిష్యత్ తరాలను ఈ సమస్య నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాటం

రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు, తాత్కాలిక ప్రయోజనాల కంటే ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని భాస్కర్ సూచించారు. పాలకపక్షం, ప్రతిపక్షాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. "రాచకొండ రాజ్యమా.. ఉలిక్కిపడు! నీ కొడుకు వచ్చాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య సభలో ఆకట్టుకుంది. రాచకొండ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. బీసీ బిడ్డగా తనను ఆశీర్వదించాలని కోరుతూ, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే ప్రాంత భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

### విమర్శలకు మించి కార్యాచరణ అవసరం

ప్రాంతాన్ని ఇన్నాళ్లు పాలించిన నాయకులు చేసిన అభివృద్ధిపై ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై విమర్శలు చేసిన ఆయన.. ప్రాజెక్టుల పూర్తి కోసం నిరంతరంగా ప్రభుత్వాలను ప్రశ్నించాలని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి శివన్నగూడ రిజర్వాయర్, రాచకొండ ఎత్తిపోతల పథకాల సాధనకు ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు.

కార్యక్రమంలో రాచకొండ ప్రాంత చరిత్ర, ప్రాధాన్యాన్ని వివరిస్తూ విమలక్క ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సాగునీరు, ఫ్లోరైడ్ సమస్య, రైతుల సంక్షేమం వంటి అంశాలు చర్చకు రావడంతో రాచకొండ దసరా ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. శివన్నగూడ ప్రాజెక్టు పూర్తి, రాచకొండ ఎత్తిపోతల పథకం అమలు, ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం వంటి అంశాలపై భాస్కర్ చేసిన పిలుపు ప్రజల్లో చర్చకు దారితీసింది. ఈ డిమాండ్లు ఎంతవరకు కార్యరూపం దాల్చుతాయన్నది రానున్న రోజుల్లో తేలనుంది.







